క్లుప్తంగా

రేపు మండల సమావేశం

పొన్నలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ సుజాత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని, అలాగే మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఎంఈఓగా కోటిరెడ్డి బాధ్యతల స్వీకరణ


పి.కోటిరెడ్డి

పామూరు: ఎంఈఓగా పి.కోటిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు కనిగిరి ఎంఈఓ పామూరు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. నూతన ఎంఈఓను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


నందవనంలో పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్


హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం, నందనవనం, వీరరాంపురం, ముప్పళ్లపాడు, దాసళ్లపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగూర్ మీరా బీఎల్ఓలతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీరరాంపురం, పాపిరెడ్డిపల్లి గ్రామాల్లో రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణచైతన్య, వీఆర్ఓలు జేమ్స్, కాశయ్య, నాసర్‌వలి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పీర్ల పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి


ముజావర్లతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

పామూరు: పీర్ల పండుగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ ఎం భీమా నాయక్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి మండలంలోని పీర్ల చావిళ్ల ముజావర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల ఊరేగింపు, భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముజావర్లతో సీఐ చర్చించారు. ఈ సందర్భంగా పీర్ల ఉత్సవంలో అనుసరించాల్సి జాగ్రత్తలను సీఐ ముజావర్లకు వివరించారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేస్తామన్నారు. ఎస్సై టి.కిషోర్‌బాబు, ముజావర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు, ఎంఈఓలు

వెలిగండ్ల.(కనిగిరిరూరల్): విద్యాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. మండలంలోని కొటాలపల్లి ఎంపీపీస్ స్కూల్ లో దాతలు కొండ్రు విజయభాస్కర్ రెడ్డి, కొండ్రు శ్రీనివాసులరెడ్డి రూ.25 వేల విలువైన విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ దాసు ప్రసాద్, దాతలు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హెచ్‌ఎం వైవీ రమణారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరిరూరల్: విద్యుత్ టవర్ మరమ్మతుల కారణంగా బుధవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ ఒక ప్రటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టౌన్ ఫీడరు పరిధిలోని కందుకూరు రోడ్డులో, నక్కల తిప్ప, ఎమ్మెస్సార్ రోడ్డు, వరమ్మ కొట్టు, కాశీనాయన గుడి, తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సీఎస్‌పురం(పామూరు): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అరివేముల ఫీడర్ పరిధిలో లైన్ మెయింటినెన్స్, చెట్లు తొలగింపు కోసం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ముళ్లపాడు, దర్శితిమ్మక్కపల్లి, చింతలపాలెం, జంగంవారిపల్లె, అరివేముల, చెర్లోపల్లి, ఏకునాంపురం, తుమ్మకుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

పట్టించుకోరు..పరిష్కరించరు

- సమస్యలపై సభ్యుల ఏకరువు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- సమస్యలు పరిష్కరించకుండా మొక్కుబడిగా మండల సమావేశాలు
- రోడ్లు, పాఠశాలలు, తాగునీటి పైప్‌లైన్ అన్నీ పెండింగ్‌లే
- కోరం లేక రెండు రోజులుగా మండల సమావేశం వాయిదా


పునాది, డోర్లు శిథిలమైన ఉన్న రేగులచెలక ఎంపీపీఎస్ పాఠశాల భవనం

సీఎస్‌పురం(పామూరు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిని గాలికొదిలేశారు. కనీసం మండల సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలను సైతం పట్టించుకునే వారే కరువయ్యారు. సమస్యలు పరిష్కరించకుండా తూతూమంత్రంగా ప్రతి నెలలకు ఒకసారి మండల సమావేశాలు నిర్వహించడం ఎందుకని సభ్యులు ధ్వజమెత్తుతున్నారు. మండల కేంద్రమైన సీఎస్ పురంతోపాటు మండలంలో ఏండ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఏఒక్క సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించిన దాఖలాలు లేవు. మండల సమావేశం సోమవారం జరగాల్సి ఉండగా కోరంలేక మంగళవారానికి వాయిదా పడింది. అయితే మంగళవారం కోరంలేకపోవడంతో సమావేశాన్ని మరోమారు వాయిదా వేశారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే ...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా మండలకేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని గ్రామాల్లో సమస్యలపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. మండలంలోని డీజీపేట, కిష్టంనాయునిపల్లి, బోడావుల దిన్నె, ఉప్పలపాడు ఎస్టీ, రంగనాయునిపల్లి, ఆర్‌కే.పల్లి, దర్శితిమ్మక్కపల్లి తదితర గ్రామాల పరిదిలో రూ.లక్షలు వెచ్చించి అంగన్‌వాడీ కేంద్రాలకోసం నిర్మిస్తున్న భవనాలు పనులు పూర్తికాక అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తిచేయకపోవడంతో నిరుపయోగంగా ఉండగా సొంతభవనాలకు నోచుకోక చాలీచాలని అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. డీజీపేట నుంచి బోయమడుగుల రోడ్డు, సీఎస్ పురం నుంచి ఆర్‌కేపల్లి రోడ్డు, బొంతవారిపల్లె రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని రేగులచలక, నల్లమడుగుల, అంబవరం కొత్తపల్లి, అరివేముల గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలు, రైతుసేవాకేంద్రాలు, ఆర్‌కేపల్లి ఆరోగ్య మందిర్‌లు పూర్తయినా నేటికి ప్రారంభానికి నోచుకోక ప్రజాసేవలకు దూరంగా ఉన్నాయి. జలజీవన్ మిషన్‌కింద చేపట్టిన పనులు సైతం ఎక్కడి గొంగళి అక్కడనే అన్న సామెతన ఉన్నాయి. రేగులచెలక రెవెన్యూకు సంబంధించి భూ అక్రమాలు జరిగాయంటూ గతంలో వెబ్‌ల్యాండ్ మొత్తం పెండింగ్‌లో పెట్టారు. దీంతో దాదాపు రెండేళ్లుగా వెబ్‌ల్యాండ్ ఓపన్‌కాకపోగా రైతులు తీవ్ర అవస్థలు పడుతూ ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. దీనిపై పలుసార్లు గ్రామ సభలు జరుగుతున్నా నేటికి సమస్యల కొలిక్కిరాలేదు.

సమస్యల అధికారుల నిర్లక్ష్యం

మండల కేంద్రమైన సీఎస్‌పురంలో ఎస్సీ బాలుర వసతి గృహం, బీసీ బాలుర వసతిగృహం ఉండగా వాటికి దశాబ్దాలుగా సొంతభవనాలు లేవు. ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లు లేకపోగా విద్యార్థులు పడే కష్టాలు అన్నీ ఇన్నీకావు. అదేవిధంగా శీలంవారిపల్లెలో నిర్మించిన హాస్టల్ నేటికి ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రైవేట్ భవనంలో బాలికలు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా అంబవరంలో ప్రైవేట్ షెడ్డులో బీసీ హాస్టల్ ఉంది. మండలంలోని చెర్లోపల్లి, రేగులచెలక గ్రామాల్లో శిథిలావస్తలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు వెళ్లదీస్తున్నారని, తక్షణం నూతన భవనాలు నిర్మించాలని ఏడాదిగా మండల సర్వసభ్య సమావేశంలో మొత్తుకున్నా అటు ప్రభుత్వం, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యారు. చెర్లోపల్లెలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బి.వెంకటేశ్వర్లు, రేగులచెలక ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని సర్పంచ్ కృష్ణకుమారిలు, ఎంపీటీసీ జాజుల తిరిపాలు, బోయమడుగుల పంచాయతీలోని గ్రామాల పరిధిలో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణం, త్రీఫేస్ విద్యుత్ అందించి రైతుల కష్టాలు తీర్చాలని ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవిలు ఎన్నిసార్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చినా నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు.


డీజీపేట సమీపంలో అటవీశాఖ అనుమతులు లేక నిలిచిన హైవే రోడ్డు


పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉన్న చెర్లోపల్లె ఎంపీపీఎస్ పాఠశాల శ్లాబు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం


చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని దోమల బెడద లేకుండా ఉంటే ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ ఎంపీడీఓ కామేశ్వరరావు అన్నారు. జరుగుమల్లి మండలంలోని ఎడ్లూరుపాడులో మంగళవారం ఉదయం చెత్తసేకరణ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు తడిచెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పించారు. తరువాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. జీవీఆర్ఎస్ ప్రోగ్రాం కింద ఎడ్లూరుపాడు గ్రామం ఎంపికైందని, చెత్త రహిత పంచాయతీగా తీర్చిదిద్దటమే తమ కర్తవ్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం మాధవి పాల్గొన్నారు.

శింగరబొట్లపాలెంలో పశు వైద్య శిబిరం


గొర్రెకు టీకా అందిస్తున్న డాక్టర్ శివరామకృష్ణ

పొన్నలూరు: మండలంలోని శింగరబొట్లపాలెంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి శివరామకృష్ణ గొర్రెలు, మేకలకు సాధారణ వైద్య పరీక్షలు చేసి నట్టల నివారణ మందులను తాపించారు. అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశు సంవర్ధ సహాయకులు తేజశ్వని, పాడి రైతులు, పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు సాగుదాం


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్, పక్కన పార్టీ నేతలు

కనిగిరిరూరల్: మనమంతా సమష్టిగా పనిచేద్దాం.. రానున్న ఎన్నికల్లో కనిగిరిలో ఘన విజయం సాధించి.. జగనన్నను సీఎం చేసుకుందాం అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులతో సమీక్షా సమావేశం చైర్మన్ గఫార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పార్టీలోని కమిటీలన్ని చురుగ్గా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేకత చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపు నిచ్చారు. భవిష్యత్ కార్యచరణపై దిశా నిర్దేశం చేశారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్ మోహన్‌రెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, ఎస్‌కే జిలాని, డాక్టర్ రసూల్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, తమ్మినేని సుజాత, నాగమణి, పులి శ్రీను, శ్రీహరి రెడ్డి, చెంచులు, రహిమాన్, కరీం, నాగూర్‌వలి, నాగూర్‌బీ, ఖాశిం, కిషోర్ తదితరులుపాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పామూరు: పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎంఈఓ పి.కోటిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు ఉద్యానవనాలను తలపించేలా సుందరంగా ఉంచాలన్నారు. ప్రతి విద్యార్థి మొక్కనాటి, దాన్ని బాధ్యత తీసుకొని సంరక్షించాలన్నారు. వివిధ సందర్భాల్లో బహుమతులుగా మొక్కలను ఇచ్చి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, వేణుగోపాల్, సీహెచ్.బసవేశ్వరరావు, సురేష్, ఎస్.అరుణ, నారాయణమ్మ, ఖాసీంవలి, రామశివమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రద్దీని బట్టి రోడ్లు వెడల్పు చేయాలి

టంగుటూరు: వాహనాలు రద్దీని బట్టి రోడ్లు వెడల్పు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ అన్నారు. నిడమానూరు గ్రామం వద్ద బస్సు బోల్తా ప్రమాదంపై ఆయన మాట్లాడారు. రోడ్డు వెడల్పు చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్లు వెడల్పుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కోరారు.

తడి, పొడిచెత్తను వేరుచేయాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ నాగూర్‌వలి

మద్దిపాడు: తడి, పొడి చెత్తను విధిగా వేరు చేయాలని డిప్యూటీ ఎంఈఓ నాగూర్‌వలి అన్నారు. మండలంలో జి.అగ్రహారంలో మంగళవారం ఎస్‌డబ్ల్యూపీసీ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

సీఎస్‌పురం(పామూరు): వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఉప్పలపాడు జంక్షన్ సమీపంలో 167బీ జాతీయ రహదారి మార్జిన్‌పై చోటుచేసుకుంది. ఎస్సై ఎం వెంకటేశ్వరనాయక్ తెలిపిన సమాచారం మేరకు ఉప్పలపాడు ఎస్టీ కాలనీకి చెందిన అటేలయ్య పనులకు వెళ్తూ తన బావమరిదికోసం 167బీ జాయతీ రహదారి ఉప్పలపాడు జంక్షన్ సమీపంలో రోడ్డుపక్కన నిలబడి ఉన్నాడు. ఈసందర్భంలో డీజీపేట నుంచి పామూరు వైపుకు వస్తున్న టాటాఏస్ వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన నిలబడిఉన్న అటేలయ్యను ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. క్షతగాత్రుని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఆదిమూలపు, బొట్ల




వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, బొట్ల రామారావు తాడేపల్లి కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు


వైద్యులను సన్మానిస్తున్న చైర్మన్ గఫార్


సీఎస్‌పురం పీహెచ్‌సీలో కేక్ కోస్తున్న డాక్టర్ మురళి, మహేష్

కనిగిరిరూరల్: డాక్టర్ డే వేడుకలను కనిగిరిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యులను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది గఫార్ మాట్లాడుతూ నిత్యం రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్స్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ యోషితారెడ్డి, ఆర్ఎంపీ ద్రోణాదుల చెంచులు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ బొట్టు శ్రీను, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): డాక్టర్ డే వేడుకలు సీఎస్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సందిరెడ్డి మురళి, డాక్టర్ మహేష్ వైద్యశాల సిబ్బందితో కలిసి కేక్‌ను కోసి పంచిపెట్టారు. సీహెచ్‌ఓ మురళి, శ్రీరామ లక్ష్మీకాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

264 బేళ్లు తిరస్కరణ


కొండపి : వేలం నిర్వహిస్తున్న అధికారులు


టంగుటూరులో పొగాకు వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 264 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. క్లస్టర్ పరిధిలోని పెట్లూరు, ఎస్ఎస్‌కండ్రిక, జగ్గరాజుపాలెం, వర్ధినేని వారిపాలెం, నరసరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1167 బేళ్లను తీసుకురాగా 903 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.247.95గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 323 పొగాకు బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రానికి కె. ఉప్పలపాడు గ్రామాలని చెందిన రైతులు 985 బేళ్లను తీసుకురాగా 662 బేళ్లను కొనుగోలు చేశారు.

గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.232.90 పలికింది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

- ఇష్టం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో కూలీల పేర్ల తొలగింపు
- రూ.500 ఇస్తేనే ఆన్‌లైన్‌లో పేరు ఎక్కిస్తానంటూ డిమాండ్

టంగుటూరు: మండలంలోని పొందూరు ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో ఆన్‌లైన్ ఉన్న కూలీల పేర్లను ఇష్టం వచ్చినట్లు తొలగిస్తున్నాడు. దీనిపై కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే రూ.500 ఇస్తేనే ఆన్‌లైన్‌లో పేరు ఎక్కిస్తానని చెబుతున్నాడు. ఇక హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వారికి కూడా మస్టర్ వేసి చెరో సగం అంటూ వారి వద్ద నుంచి వసూలు చేస్తున్నట్లు స్థానిక టీడీపీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఉపాధి పనికి వచ్చే వారి వద్ద నుంచి వారానికి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నట్లు కూలీలు వాపోతున్నారు. పనులకు వెళ్లే వారికి తక్కువ నగదు జమవుతుందని, పనికి రాని వారికి మాత్రం ఎక్కువమొత్తం జమవుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో పేర్లు తొలగిస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి


పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ

టంగుటూరు: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలని డీఈఓ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కందులూరు ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని తరగతి వారీగా సమీక్షించారు. విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకునేందుకు కష్టపడి చదవాలని సూచించారు. ఈ ఏడాది ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయినందున ఉపాధ్యాయులు కష్టపడి పని చేయాన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో పఠనాశక్తి కలిగినప్పుడే వారు పాఠశాలకు సక్రమంగా వస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నిర్వాహకులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు జి.సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పానకాలరావు

పీసీపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి పానకాలరావు అన్నారు. మండల పరిధిలో పెద అలవపాడులో పెన్షన్ల పంపిణీ, వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తి పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ: విద్యార్థినులు చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే తమను తాము రక్షించుకోగలరని ఎస్సై బి.మహేంద్ర అన్నారు. స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం విద్యార్థినులకు ఎస్సై బి మహేంద్ర చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ కాలేజీల్లో ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాలు వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని హితవు పలికారు. నేటి సమాజంలో సైబర్ క్రైం బాధితులు ఎక్కువగా ఉన్నారని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసలు కావద్దని డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే తెలపాలని విజ్ఞప్తి చేశారు. పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సౌజన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వేలం కేంద్రం ప్రారంభం

కనిగిరిరూరల్: ఎట్టకేలకు పొగాకు వేలం ప్రారంభమైంది. గత రెండు రోజుల నుంచి నిరసనలు, ధర్నాలతో కనిగిరి పొగాకు కేంద్రంలో వేలం నిలిచిన సంగతి విదితమే. అయితే మంగళవారం అధికారులు ఇచ్చిన హామీలతో అలవలపాడు క్లస్టర్ రైతుల పొగాకు బేళ్లు కొనుగోలు వేలం కొనసాగించారు. మొత్తం 658 బేళ్లకు గాను 502 బేళ్లను కొనుగోలు చేయగా, 156 బేళ్ల తిరస్కరణ అయినట్లు బోర్డు అధికారులు తెలిపారు. గరిష్ట ధర రూ. 280 పలకగా, కనిష్ట ధర రూ.150, సరాసరి ధర రూ, 244 పలికింది. కనిగిరి, కందుకూరు ఆక్షన్ సూపరింటెంట్‌లు కోటేశ్వరరావు, రాజగోపాల్‌ల పర్యవేక్షణలో 9 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని బేళ్లు కొనుగోలు చేశారు.

మండల సమావేశం వాయిదా

సీఎస్‌పురం(పామూరు): మండలసర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. సోమవారం జరగాల్సి ఉండగా నిర్దిష్ట సమయం లోగా సభ్యులు సమావేశానికి రాకపోవడంతో కోరంలేక మంగళవారానికి వాయిదా పడింది. అయితే మంగళవారం కూడా 12 గంటల వరకు సభ్యులు రాకపోవడంతో కోరంలేక మరోమారు వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు.